సాక్షి
విశాఖపట్నం
బుధవారం । 4 । జూన్ । 2025

'వెన్నుపోటు దినం' విజయవంతం చేయండి

వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు పిలుపు



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మోసాలను ఎండగడుతూ బుధవారం చేపట్టనున్న 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ కార్యాలయం జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్రగా 'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి శాసన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. విశాఖ తూర్పు, ఉత్తర, దక్షిణ నియోజవర్గాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. భీమిలి, గాజువాక నియోజకవర్గాలకు సంబంధించి ఆయా నియోజకవర్గాల్లోనే నిరసన కార్యక్రమం చేపడతారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలను ఎండగడతామన్నారు.

ఏడాదిగా.. దగా

కూటమి పాలన.. నయవంచన, వెన్నుపోటు, కు'తంత్రం'



- బూటకపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం
- విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకూ అందరికీ పంగనామం
- 11 వేల పెన్షన్ల తొలగింపు.. 11,824 వలంటీర్లు, ఎండీయూ ఆపరేటర్లపై వేటు
- విశాఖలో ఐటీ కంపెనీ పేరుతో ఉర్సాకు అప్పనంగా భూములు
- గెలిపిస్తే స్టీల్‌ప్లాంట్ కోసం పోరాడతామని చెప్పి పత్తా లేకుండా పోయిన పవన్‌కల్యాణ్
- ఉపాధి కోల్పోయి ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులపై ఖాకీలతో లాఠీఛార్జీలు



నా పేరు జగదీష్. మధురవాడలో వలంటీర్‌గా పనిచేశాను. రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు చెబితే ఆశపడ్డాం. ఉద్యోగ భద్రత ఉంటుందని సంబరపడ్డాం. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జీతం పెంచకపోగా మమ్మల్ని తొలగించారు. రోడ్డున పడేశారు. ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను వేడుకున్నా కనికరించడం లేదు. కొత్త ఉద్యోగాలు ఇస్తామని చెప్పి.. ఉన్న వారిని తీసేయడం దుర్మార్గం.



నా పేరు సతీష్. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) నిర్వాహకుడిగా పనిచేసేవాడిని. కూటమి ప్రభుత్వం వస్తే ఇంటింటి రేషన్ విధానాన్ని రద్దు చేయబోమని, మాకు ఉద్యోగ భద్రత కల్పిస్తామంటే పొంగిపోయాం. ఇప్పుడు ఇంటింటి రేషన్ నిలిపివేయడంతో జీవన ఆధారాన్ని కోల్పోయాం. 20 నెలల ఒప్పందంఉన్నప్పటికీ.. వాహనాలను నిలిపివేయడం అన్యాయం.

ఇలా ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వేలాది మంది జీవనాధారాన్ని కోల్పోయారు. కుటుంబాలతో రోడ్డున పడ్డారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగులకు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాయమాటలతో అరచేతిలో స్వర్గాన్ని చూపించారు. ఇప్పుడు చేతిలో ఉన్న ఉపాధిని సైతం దూరం చేశారు. వలంటీర్లకు రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని నోట్లో బూర్లు వండేశారు. అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను రద్దు చేసి 11,122 మంది నోట్లో మట్టి కొట్టారు. రైస్ కార్డుదారులకు మరిన్ని నిత్యావసరాలు పంపిణీ చేస్తామని మభ్యపెట్టారు. ఇప్పుడు ఇంటింటి రేషన్ విధానానికి స్వస్తి చెప్పి పేదలను కిలోమీటర్లు నడిపించి, గంటల తరబడి క్యూలో నిలబెట్టి అష్టకష్టాలు పెడుతున్నారు. సంపద సృష్టిస్తామని డబ్బా కొట్టి.. ఇప్పుడు విద్యుత్ ఛార్జీలు, భూముల ధరలు పెంచి సుమారు రూ.250 కోట్ల భారం మోపి నగర ప్రజల నడ్డివిరిచారు. విశాఖకు ఐటీ పెట్టుబడులు తీసుకొస్తామని కబుర్లు చెప్పి.. ఊరూపేరూ లేని ఉర్సా కంపెనీకి రూ.వందల కోట్లు విలువ చేసే భూములను ధారాదత్తం చేశారు. సూపర్ సిక్స్ హామీలు గాలికొదిలేశారు. ప్రత్యర్థి పార్టీ నాయకులు, అభిమానులు, సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడుతూ.. కక్ష సాధిస్తూ.. పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో బాబు ష్యూరిటీ.. వెన్నుపోటు గ్యారెంటీ అని చంద్రబాబు మరోసారి నిరూపించారు.

–విశాఖ సిటీ

సూపర్ సిక్స్ హామీలకు మంగళం

సూపర్ సిక్స్ పేరుతో బూటకపు హామీలు గుప్పించి ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ హామీలు నెరవేర్చడానికి ఖజానా ఖాళీ అయిపోయిందని కుంటి సాకులు చెబుతున్నారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని విద్యార్థులను మోసం చేశారు. ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానని, ఉచిత బస్సు ప్రయాణమని మాయమాటలు చెప్పారు. ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి అన్నదాతకు వెన్నుపోటు పొడిచారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్, పీఆర్‌సీ, పెండింగ్ డీఏలు అన్నీ ఇస్తామని చెప్పి బుట్టలో వేసుకుని ఇప్పుడు నిలువునా ముంచారు. ఇలా విద్యార్థుల నుంచి ఉద్యోగుల వరకు అందరికీ పంగనామాలు పెట్టారు.

నిరసనలతో హోరెత్తుతున్న విశాఖ

కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో వలంటీర్లు, 108 ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ టీచర్లు, ఆశా కార్యకర్తల ధర్నాలు, నిరసనలతో విశాఖ హోరెత్తిపోతోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుకు, సమస్యల పరిష్కారానికి ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న ధర్నాలతో దద్దరిల్లుతోంది. ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని 108 ఉద్యోగులు.. విధుల్లోకి తీసుకొని రూ.10 వేలు వేతనం ఇవ్వాలని వలంటీర్లు.. సమస్యలు పరిష్కరించాలంటూ ఆశ వర్కర్ల నిరసనలు.. ఆకలి కేకలతో అలమటిస్తూ పెండింగ్ జీతాల కోసం ఆయాల పాలికేకలు.. ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రోడ్డున పడ్డ 702 మంది ఆపరేటర్లు, హెల్పర్ల ఆర్తనాదాలు.. ఇలా చంద్రబాబు ఏడాది పాలనలోనే అన్ని వర్గాల నుంచి అసహనం కట్టలు తెంచుకుంటోంది.




జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆశ వర్కర్లు, 108 ఉద్యోగుల నిరసన(ఫైల్)



గాల్లో మేడలు.. త్రీడీలో ప్లాన్లు

విశాఖ అభివృద్ధికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా చేపట్టలేదు. క్వాంటం వ్యాలీ, డేటా హబ్ పేర్లు చెప్పి గాల్లో మేడలు కడుతోంది. త్రీడీలో ప్లాన్లు చేస్తూ ప్రచారాలు చేసుకుంటోంది. వాస్తవానికి గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, ప్రణాళికలే ప్రస్తుతం అమలవుతున్నాయి. మూడేళ్ల క్రితమే సిద్ధమైన విశాఖ మెట్రో రైలు డీపీఆర్‌కు అనుగుణంగా అడుగులు పడుతున్నాయి. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వెళ్లే మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఉండేందుకు 15 మాస్టర్ ప్లాన్ అభివృద్ధి పనుల టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. కూటమి ప్రభుత్వం కొత్తగా ఒక్క రహదారికి కూడా ప్రణాళిక చేయలేదు.



వలంటీర్ల నిరసన(ఫైల్)

దౌర్జన్యాలు.. బెదిరింపులు

ఏడాదిగా విశాఖలో దౌర్జన్యాలు, బెదిరింపులు విపరీతంగా పెరిగిపోయాయి. ప్రధానంగా వైఎస్సార్‌సీపీ మేయర్ సీటును చేజిక్కించుకోడానికి కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచింది. అంగ, అర్థ, పోలీస్, అధికార బలాన్ని ప్రయోగించి వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లను బెదిరించి.. డబ్బు ఎరవేసి తమ వైపునకు తిప్పుకుంది. మేయర్‌తో పాటు డిప్యూటీ మేయర్ సీట్లను అక్రమ పద్ధతిలో హస్తగతం చేసుకుంది. ఇదిలా ఉంటే విశాఖలో తెలుగు తమ్ముళ్లు భూములను చెరబడుతున్నారు. ఖాళీ స్థలాలు కనిపిస్తే కబ్జాలకు పాల్పడుతున్నారు. ప్రజాప్రతినిధులు తమ అనుచరులకు అడ్డదారుల్లో నిబంధనలను సైతం పక్కనపెడుతూ టెండర్లు కట్టబెడుతున్నారు. వారి అక్రమాలను ప్రశ్నించిన వారిపై విశాఖలోనే కాకుండా రాష్ట్రంలో అనేక పోలీస్‌స్టేషన్లలో అక్రమ కేసులు పెట్టించి కక్ష సాధింపులకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మోసం, అవినీతి, కుట్ర, దగా, వెన్నుపోటు మినహా విశాఖ అభివృద్ధికి గానీ, నగరవాసుల సంక్షేమానికి గానీ ఒరిగిందేమీ లేదనడానికి ఇవే నిదర్శనాలు.

పత్తా లేకుండా పోయిన పవన్ కల్యాణ్



'ఒక్కసారి అధికారం ఇచ్చి చూడండి. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా పోరాడతాం' అని ఎన్నికలకు ముందు చెప్పిన పవన్ కల్యాణ్ ఇప్పుడు డిప్యూటీ సీఎం అయ్యాక పత్తా లేకుండా పోయారు. ఉక్కు పరిశ్రమను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం నెమ్మదిగా ఉద్యోగులకు వీఆర్ఎస్ పేరుతో ఇంటికి పంపిస్తోంది. కాంట్రాక్టు కార్మికులపై వేటు వేసింది. దీంతో వేలాది మంది కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. గత ఏడాది కాలంగా కార్మికులు రోడ్డెక్కి ఆందోళనలు, ర్యాలీలు, నిరాహార దీక్షలు చేస్తున్నా.. ముఖ్యమంత్రి చంద్రబాబు గానీ, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌గానీ వారి గోడును పట్టించుకున్న దాఖలాలు లేవు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కార్మికులు నిరసనలు చేపడుతుంటే.. వారి ఆందోళనలను అణిచివేయడానికి పోలీసులను ప్రయోగిస్తుండడం గమనార్హం.

ఐటీ, పర్యాటక రాజధాని పేరుతో మోసం

చంద్రబాబు జిల్లాలో పర్యటించిన ప్రతి సారి విశాఖను ఆర్థిక రాజధాని, పర్యాటక రాజధానిగా అభివర్ణించడం మినహా ఆ దిశగా ఒక్క అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలు లేవు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భీమిలిలో ఒబెరాయ్ గ్రూప్, మే ఫెయిర్ సంస్థల సెవెన్ స్టార్ హోటళ్లకు శంకుస్థాపన జరిగింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఆ పెట్టుబడుల గొప్పతనాన్ని కూటమి ప్రభుత్వం తమ ఖాతాలో వేసేసుకుంటోంది. కూటమి ప్రభుత్వంలో ఒక్క కొత్త ఆతిథ్య రంగ సంస్థ కూడా రాలేదు. అలాగే మంత్రి నారా లోకేష్ విశాఖను ఐటీ రాజధానిగా చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వంలో విశాఖలో కార్యకలాపాలు ప్రారంభించడానికి టీసీఎస్ ముందుకొస్తే ఇప్పుడు తన ప్రతిభగా ప్రచారం చేసుకుంటున్నారు. దీని పే రు చెప్పి ఊరు పేరు లేని ఉర్సా కంపెనీకి రూ.500 కోట్లు విలువ చేసే 60 ఎకరాల భూములను ధారాదత్తం చేసేశారు. ఐటీ కంపెనీల పేరుతో విశాఖ సంపదను, భూములను దోచి పెడుతున్నారు.

మోసాలను ఎండగడతాం..

వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు



సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలకు చేసిన మోసాలను ఎండగడతామని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించనున్న 'వెన్నుపోటు దినం' నిరసన కార్యక్రమాన్ని ఉత్తరాంధ్రలోని అన్ని నియోజకవర్గాల్లో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు.

అనుమతి కోసం పోలీసులకు లేఖ



ఏడీసీపీకి అనుమతి కోరుతూ లేఖను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు

విశాఖ సిటీ: వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి అనుమతి కోరుతూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏడీసీపీ అడ్మిన్‌కు లేఖ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్త మొల్లి అప్పారావు, పార్టీ కార్యాలయం పర్యవేక్షకుడు రవిరెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి సతీష్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవాత్సవ్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గ, జిల్లా అనుబంధం విభాగ అధ్యక్షులు పేడాడ రమణికుమారి, బోని శివరామకృష్ణ, దేవరకొండ మార్కండేయులు, వడ్డాది దిలీప్, పార్టీ నాయకులు నీలి రవి, ఎస్.కె.బాబ్జి, కొట్యాడ సూర్య, పీతల గోవింద్, జానకిరామ్, విశాలాక్షి, అప్పన, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు బినామీల పరం

- ఆరోపించిన దళిత సంఘాల నాయకులు
- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి చర్యలు కరువు




సమస్యలు తెలుసుకుంటున్న మాల కార్పొరేషన్ చైర్మన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తదితరులు



సమీక్షకు హాజరైన జిల్లాలోని వివిధ దళిత సంఘాల నాయకులు

ఎంవీపీకాలనీ: జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు, రుణాల మంజూరులో బినామీల పాత్ర పెరిగిపోయిందని దళిత సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని సంక్షేమ భవన్ సెమినార్ హాలులో మంగళవారం రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ అధ్యక్షతన ఎస్సీ సంఘాల నాయకులు, వీధి వ్యాపారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు పలు సమస్యలను లేవనెత్తారు. స్కూల్ బస్సులు, ట్రాక్టర్ల వంటి పెద్ద మొత్తంలో రుణాలు బినామీల పేరుతో మంజూరవుతున్నాయని ఆరోపించారు. స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు గడువు ముగియకముందే వెబ్‌సైట్లు మొరాయిస్తున్నాయని, దీంతో అర్హులైన వారు నష్టపోతున్నారని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కార్పొరేషన్ ద్వారా ఎస్సీ యువతకు పారిశ్రామిక ప్రోత్సాహం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేషన్‌కు చెందిన విలువైన భూములను పరిరక్షించడంలో అధికారులు విఫలమవుతున్నారని, భూమి కొనుగోలు పథకం పూర్తిగా నిలిచిపోయిందని తెలిపారు. విశాఖపట్నం జిల్లా పూర్తిగా నగరాన్ని ఆనుకుని ఉన్నందున.. రుణాల మంజూరు ప్రక్రియలో అందుకు అనుగుణంగా మార్పులు చేయాలని సూచించారు. ఎస్సీ కార్పొరేషన్‌లో ప్రక్షాళన అవసరమని, పారదర్శకత పెంచాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ దళిత సంఘాల నాయకులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాల భౌగోళిక పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్గదర్శకాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యపద్మ, మాల కార్పొరేషన్ డైరెక్టర్లు కొండ్రు మరిడయ్య, సబ్బవరపు గణేష్, పౌర సరఫరాలశాఖ డైరెక్టర్ బోడపాటి శివదత్త, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


ఎస్సీలకు మేలు చేసేలా లేవు



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న పథకాలు నగర ఎస్సీలకు మేలు చేసే విధంగా లేవు. జిల్లాల విభజనతో విశాఖ జిల్లా పూర్తిగా నగరం పరిధిలోకి వచ్చింది. బ్రిక్స్, రీసైక్లింగ్, ఇతర చిన్న పరిశ్రమలను ఎస్సీలు నిర్వహించేందుకు స్థలాలు అందుబాటులో లేవు. ఈ నేపథ్యంలో సిటీ జీవనానికి అనుగుణంగా పథకాల అమలులో మార్పులు జరగాలి. స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు గడువు కంటే 2 రోజులు ముందే వెబ్‌సైట్ నిలిచిపోయింది. దీంతో వందల మంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. రుణాల మంజూరులో బ్యాంకులు సైతం సహకరించడం లేదు.

– కస్తూరి వెంకటరావు, ఎస్సీ సంఘం నాయకుడు

భూమి కొనుగోలు పథకం నిలిచిపోయింది



ఎస్సీల అభివృద్ధికి బాటలు వేయడం కార్పొరేషన్ ప్రధానమైన విధి. ఈ ప్రక్రియలో భూమి కొనుగోలు పథకం కీలకం. వనరులు కొంత మంది చేతులోనే ఉండిపోకుండా ఎస్సీలను కూడా ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ పథకం లక్ష్యం. అయితే కొన్నేళ్లుగా నిలిచిపోయిన ఈ పథకాన్ని పునరుద్ధరించాల్సిన అవసరముంది. కేంద్ర పథకాలైన ఎన్ఎఫ్‌డీసీ, ఇతర పథకాలు రాష్ట్రంలోని ఎస్సీలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– వై.వరప్రసాద్, ఎస్సీ సంఘం నాయకుడు

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలు

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ కడప క్రీడా పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి 4, 5 తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 4వ తరగతిలో ప్రవేశానికి 2015 ఏప్రిల్ 1, ఆ తర్వాత జన్మించిన వారు, 5వ తరగతి ప్రవేశానికి 2014 ఏప్రిల్ 1, ఆ తర్వాత జన్మించిన వారు అర్హులు. జనన ధ్రువీకరణ పత్రంతోపాటు, ఏదైనా ప్రభుత్వ, గుర్తింపు పొందిన పాఠశాలలో చదివిన వారై ఉండాలి. అర్హులైన వారు ఈ నెల 16లోగా http://apsportsschool.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని విశాఖ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన అప్లికేషన్స్ స్క్రీనింగ్ చేసి షార్ట్‌లిస్ట్ చేసిన క్రీడాకారులు వచ్చే నెల 1 నుంచి 3 వరకు నిర్వహించే జిల్లా స్థాయి ఎంపికలకు ఒరిజినల్ పత్రాలతో హాజరు కావాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో అర్హత సాధించిన వారు వచ్చేనెల 10, 11వ తేదీల్లో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి ఎంపికలకు అర్హత పొందుతారు.

6 నుంచి మూడో విడత చందనం అరగదీత

సింహాచలం: ఈ నెల 6 నుంచి మూడవ విడత చందనం అరగదీత ప్రారంభం కానుంది. జ్యేష్ఠ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 11న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మూడవ విడతగా సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని సమకూర్చేందుకు ఈ అరగదీతను చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం ఆలయంలో చందనం చెక్కలను అరగదీతకు వీలుగా ముక్కలు చేశారు.

కోడి వ్యర్థాల టెండర్లు రద్దు

కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ నిర్ణయం

సాక్షి ఎఫెక్ట్..



కోడి వ్యర్థాల సేకరణ

డాబాగార్డెన్స్: కోడి వ్యర్థాల సేకరణ, రవాణాలో జరుగుతున్న అక్రమాలు, అవినీతి, అధికార కూటమిలోని అంతర్గత కుమ్ములాటలపై 'సాక్షి'గత నెల 29న ప్రచురించిన 'కోళ్ల వ్యర్థాల కోసం కుమ్ములాటలు!' అనే కథనానికి కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ స్పందించారు. జీవీఎంసీ పరిధిలోని కోడి వ్యర్థాల టెండర్లను రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. కోడి వ్యర్థాల సేకరణ వ్యవహారంలో అధికార కూటమిలో తీవ్ర విభేదాలు తలెత్తాయి. అధికారికంగా టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు కొందరు నేతలు మద్దతిస్తుండగా, అనధికారిక సేకరణదారులకు మరికొందరు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ దండుబజారులో జరిగిన గొడవ విషయమై మహారాణిపేట పోలీసులపై ఒత్తిడి చేశారు. జీవీఎంసీ అధికారులపై మండిపడుతూ తమ వారే వ్యర్థాలు సేకరిస్తారని, ఎలా అడ్డుకుంటారని గట్టిగా కేకలు వేస్తూ హెచ్చరించారు. అలాగే జీవీఎంసీలోని 8 జోన్లకు సంబంధించి 8 మందికి టెండర్లు అప్పగించడంపై కూడా 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఈ మేరకు జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ వివాదాస్పదంగా మారిన కోడి వ్యర్థాల టెండర్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

మేయర్ వర్సెస్ కార్పొరేటర్ : ఇదే అంశంపై గత సోమవారం జీవీఎంసీలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రమాదకర కోడి వ్యర్థాల అక్రమ రవాణా, అవినీతిలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, జీవీఎంసీ ప్రజారోగ్య అధికారుల ప్రమేయాన్ని నిరోధించాలని కోరుతూ జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి నగర మేయర్ పీలా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో మేయర్‌కు, కార్పొరేటర్‌కు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. జీవీఎంసీకి మచ్చ తీసుకురావద్దని మూర్తి యాదవ్ సూచించగా.. 'నా స్థానానికి నీవు విలువ ఇవ్వు. నీ స్థానానికి విలువ తీసుకో'అంటూ మేయర్ మండిపడ్డారు. ఈ క్రమంలో 'మీ వాయిస్ బాగోలేదు' అంటూ మేయర్ అతనిపై తీవ్ర స్వరంతో హెచ్చరించారు. దీంతో మరోసారి కూటమి పార్టీల్లో అంతర్గత కుమ్ములాటలు బయటపడ్డాయి.

విశాఖ అభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: విశాఖను ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. విశాఖలో వన్యప్రాణుల అభయారణ్యం అభివృద్ధిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసేందుకు వచ్చిన సింగపూర్‌కు చెందిన మాండై వైల్డ్ లైఫ్ ప్రతినిధులతో మంగళవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటకులను ఆకర్షించే విధంగా కైలాసగిరిపై జిప్‌లైనర్, స్కై సైక్లింగ్‌ను ఏర్పాటు చేసి నట్లు చెప్పారు. త్వరలోనే గ్లాస్ బ్రిడ్జ్ కూడా అందుబాటులోకి వస్తున్నట్లు తెలిపారు. రోప్‌వేను మరింత ఆధునికీకరణ దిశగా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. జూ పార్క్ క్యూరేటర్ మంగమ్మ జూ అభివృద్ధిపై వివరించారు. పార్కును మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ శ్రీభరత్, చైర్మన్ ప్రణవ్‌గోపాల్ సూచించారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, మాండై వైల్డ్ లైఫ్ గ్రూప్ సీఈఓ మైక్ బార్క్లే, ఉపాధ్యక్షుడు మార్క్ క్రైమెడ్స్ పాల్గొన్నారు.

డిజిటల్ భాగ్యం కలిగేనా?



ప్రస్తుతం రోడ్డు పక్కన ఉన్న కాకా హోటల్ దగ్గర నుంచి ఫైవ్‌స్టార్ హోటల్స్, షాపింగ్ మాల్స్, చిన్న చిన్న కూర గాయలు, కిరాణా షాపుల్లో సైతం వినియోగదారులు ఫోన్‌పే, గుగూల్‌పే వంటి యాప్‌లతో చెల్లింపులు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ నగదు రహిత లావాదేవీలకు అలవాటైపోయి కొద్ది మొత్తం నగదుతో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అయితే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మాత్రం డిజిటల్ చెల్లింపులు అందుబాటులో లేవు. దీంతో భక్తులు ఒకింత ఇబ్బందులకు గురవుతున్నారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను ప్రవేశపెట్టడం ద్వారా భక్తులకు సౌలభ్యం కలగడమే కాకుండా.. దేవస్థానం ఆదాయం కూడా గణనీయంగా పెరిగేందుకు ఆస్కారం ఉంది. - సింహాచలం

ఆధునిక ప్రమాణాలతో..

అయితే డిజిటల్ చెల్లింపుల అమలులో కొన్ని సాంకేతిక సమస్యలు, దుర్వినియోగం జరిగే అవకాశం వంటి అంశాలపై దేవస్థానం వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇవి సహేతుకమైనవే అయినప్పటికీ.. పటిష్టమైన భద్రతా ప్రమాణాలతో కూడిన ఆధునిక సాఫ్ట్‌వేర్‌ను వినియోగించడం ద్వారా ఈ సమస్యలను అధిగమించవచ్చు. భక్తుల సౌలభ్యాన్ని, దేవస్థానం ఆర్థిక ప్రయోజనాలను, లావాదేవీల్లో పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని.. సింహాచలం దేవస్థానంలో కూడా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

- అప్పన్న సన్నిధిలో అన్నీ నగదు లావాదేవీలే..
- డిజిటల్ పేమెంట్లు లేక భక్తుల అవస్థలు
- విరాళాల సమర్పణలో నగదు రహిత చెల్లింపులతో మేలు
- తద్వారా భక్తులకు సౌలభ్యం, దేవస్థానానికి ఆదాయం

ప్రస్తుతం సింహాచలంలో దర్శనం టికెట్లు, వివిధ ఆర్జిత సేవల టికెట్లు, ప్రసాదాల కొనుగోలు, కేశఖండన వంటి అన్ని సేవలకు నగదు చెల్లింపు తప్పనిసరి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఒడిశా, చత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ వంటి సుదూర ప్రాంతాల నుంచి సింహగిరికి భక్తులు తరలివస్తుంటారు. అయితే సరిపడా నగదు వెంట



రాజగోపురం వ్యూ

తెచ్చుకోలేనివారి భక్తుల బాధలు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా స్మార్ట్‌ఫోన్లు అధికంగా వినియోగించే యువత.. సరిపడా నగదు వెంట తెచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్, బ్యాంకు ఖాతాలో నగదు ఉన్నప్పటికీ.. ఆలయ కౌంటర్ల వద్ద ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి డిజిటల్ చెల్లింపుల సౌకర్యం లేకపోవడంతో గంటల తరబడి క్యూలో నిరీక్షించి.. చివరకు నిరాశకు గురవుతున్నారు. కొండ దిగువన బస్సు టికెట్టు నుంచి కొండపైన ప్రతి అవసరానికీ నగదు కోసం ఇతరులను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. డిజిటల్ చెల్లింపులు అందుబాటులోకి వస్తే.. ఈ సమస్యలన్నీ తీరుతాయని భక్తులు అంటున్నారు.

దేవస్థానానికి ఆదాయ మార్గం

డిజిటల్ పేమెంట్‌లు అందుబాటులో లేకపోవడంతో దేవస్థానం కొంత ఆదాయం నష్టపోతోందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా నిత్యాన్నదాన పథకానికి విరాళాలు అందించాలనుకునే భక్తులు అనేకమంది ఉంటారు. ఈ పథకానికి సంబంధించి ప్రస్తుతం నగదు, చెక్కు, డీడీ రూపంలో విరాళాలు స్వీకరిస్తున్నారు. స్వామికి విరాళం ఇవ్వాలని వారు ముందుగా నిర్ణయించుకుని సింహగిరికి వస్తారు. పై మూడు పద్ధతుల్లో ఏదొకదాన్ని అనుసరించి విరాళం అందజేస్తుంటారు. కాగా.. ఆలయానికి వచ్చిన తర్వాత, స్వామి వారి దర్శనానంతరం లేదా అన్నప్రసాదం స్వీకరించిన తర్వాత తక్షణమే తమకు తోచినంత విరాళం ఇవ్వాలని చాలా మంది భక్తులు భావిస్తుంటారు. అయితే చేతిలో తగినంత నగదు లేకపోవడం, డిజిటల్ చెల్లింపుల సౌకర్యం అందుబాటులో లేకపోవడంతో వీరు విరాళం ఇవ్వలేక వెనుదిరుగుతున్నారు. ప్రస్తుతం అన్నప్రసాద విభాగం కౌంటర్ వద్ద రోజూ పదుల సంఖ్యలో భక్తులు డిజిటల్ చెల్లింపుల గురించి ఆరా తీస్తున్నారు. డిజిటల్ చెల్లింపులతో చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల వరకు విరాళాలు సులభంగా స్వీకరించే వీలుంటుంది, తద్వారా అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా, సమర్థవంతంగా నిర్వహించవచ్చు. అంతేకాకుండా దర్శనం టికెట్లు, ఇతర సేవల ద్వారా కూడా దేవస్థానానికి పారదర్శకంగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.



అన్నప్రసాదం భవనం వద్ద కౌంటర్‌లో విరాళాలు చెల్లిస్తున్న భక్తులు



సింహగిరిపై ఉన్న రూ.100 టికెట్ కౌంటర్



నగదు చెల్లించి టికెట్లు తీసుకుంటున్న భక్తుడు

తోటి భక్తుల వద్ద నగదు తీసుకున్నా..



నా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనానికి సింహగిరికి వచ్చా. రూ.300 టికెట్లు మొత్తం ఏడు తీసుకుందామని కౌంటర్ వద్దకు వెళ్లా. ఫోన్‌పే ద్వారా చెల్లిస్తానని చెప్పడంతో అక్కడ లేదన్నారు. దీంతో క్యూ నుంచి బయటకు వచ్చేశా. నగదు కూడా సరిపడినంత చేతిలో లేకపోవడంతో.. సింహగిరిపై పలువురు భక్తులను అడిగి నగదు తీసుకున్నా. వారికి ఫోన్‌పే చేశా.

– శ్రీనివాస్, ఆర్మీ ఉద్యోగి, శ్రీకాకుళం

నా భార్య దగ్గర నగదు ఉండటంతో..



నా కుటుంబ సభ్యులతో కలిసి కాకినాడ నుంచి సింహాచలం వచ్చాను. రూ.300 టికెట్లు మొత్తం ఐదుగురికి తీసుకునేందుకు కౌంటర్ వద్దకు వెళ్లాను. అక్కడ ఫోన్ పే లేదని చెప్పడంతో కంగారు పడ్డాను. చేతిలో నగదు లేదు. అయితే మా ఆవిడ నగదు తీసుకొచ్చింది కాబట్టి ఇబ్బంది తప్పింది.

– ప్రకాష్, కాకినాడ, మార్కెటింగ్ ఉద్యోగి

గంటపాటు ఎదురుచూశా..



నేను హైదరాబాద్ నుంచి వచ్చాను. చాలా వరకు నగదు రహిత లావాదేవీలు చేయడానికే ఇష్టపడతాను. నాలుగు టికెట్లు తీసుకోవాలని సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయం వద్దకు వెళ్లాను. అక్కడ కేవలం నగదు మాత్రమే ఇవ్వాలని చెప్పడంతో రూ.1,200 నగదు కోసం గంటపాటు ఎదురుచూశాను. చివరికి ఓ భక్తుడు ఇవ్వడంతో ఊపిరి పీల్చుకున్నాను. డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి తీసుకురావాలి.

– రంజిత్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, హైదరాబాద్

యాప్‌లపైనే ఆధారపడుతున్నారు



ప్రస్తుతం డిజిటల్ పేమెంట్లు చేసేందుకే ఎక్కువ మంది ప్రజలు మొగ్గు చూపుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్, ఖాతాలో నగదు ఉంటే ఫోన్ పే, గుగూల్ పే తదితర యాప్‌లు ఉన్నాయన్న ధీమాతో వస్తున్నారు. తీరా వచ్చాక ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది మహిళలు, యువతులు ఎవరినీ నగదు అడగలేక తమలో తామే సతమతమవుతున్నారు. డిజిటల్ పేమెంట్లు అందుబాటులోకి తీసుకొస్తే అలాంటి వారికి సౌలభ్యంగా ఉంటుంది.

– బి.శ్రీనుబాబు, గాజువాక

'వెన్నుపోటు దినం' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు, ఎమ్మెల్సీ కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, రమణికుమారి

సాక్షి, విశాఖపట్నం: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో రాష్ట్ర ప్రజలను మోసగించిన తీరును ఎండగడుతూ బుధవారం జరిగే 'వెన్ను పోటు దినం' కార్యక్రమానికి విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు, ఎమ్మెల్యే వరుదు కల్యాణి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆధ్వర్యంలో మంగళవారం మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మహిళా విభాగ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.కె.రాజు, వరుదు కల్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ సుభద్ర కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. చిన్నారులపై అఘాయిత్యాలు, దాడులు జరుగుతున్నా.. కూటమి ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఏడాది పాలనలో ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు కాలేదని.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను ప్రజలకు చెప్పే బాధ్యతను మహిళలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, వార్డు మహిళా నేతలు పాల్గొన్నారు.

7న గాదిరాజు ప్యాలెస్‌లో యోగాసనాల ప్రదర్శన

ఎంవీపీకాలనీ: గాదిరాజు ప్యాలెస్ వేదికగా ఈ నెల 7న ఓం ప్రీ యోగా ఆధ్వర్యంలో 600 మంది సాధకులతో యోగాసనాల ప్రదర్శన కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు సంస్థ నిర్వాహకుడు డాక్టర్ చిలకా వెంకట రమేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యోగాంధ్రలో భాగంగా ఆ రోజు ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని, యోగా అభ్యసన ప్రక్రియ, ఆసనాల ప్రదర్శన ఉంటుందన్నారు.

నాస్కామ్ ఉచిత ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్, తదితరులు

మద్దిలపాలెం: నాస్కామ్ ఉచిత ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఏయూ పరిధిలో 50 వేల మంది ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ప్రోగ్రామ్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి, మాట్లాడారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, ఏపీ ఉన్నత విద్యా మండలి, ఏయూ సంయుక్తంగా నాస్కామ్ సహకారంతో విద్యార్థులకు ఈ ఉచిత స్వల్పకాలిక ఇంటర్న్‌షిప్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. దీనికి ఈ నెల 7లోగా ఉన్నత విద్యా మండలి పోర్టల్‌లో విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 90526 56967లో సంప్రదించాల్సిందిగా సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, నాస్కామ్ ఫ్యూచర్ స్కిల్స్ ప్రైమ్ రీజినల్ హెడ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు లారీ బీభత్సం

నలుగురికి గాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



నుజ్జు నుజ్జు అయిన ఆటో ముందుభాగం



లంకెలపాలెం కూడలిలో బీభత్సం సృష్టించిన బొగ్గు లారీ

పరవాడ: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో మంగళవారం ఉదయం ఓ బొగ్గు లారీ బీభత్సం సృష్టించింది. విశాఖ పోర్టు ట్రస్టు నుంచి అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌కు వెళ్తున్న బొగ్గు లారీ ఉదయం 6.45 గంటల సమయంలో అతివేగంగా వచ్చి ముందున్న కారును, ఆటోను ఢీకొట్టింది. అనంతరం సిగ్నల్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని నిలిచిపోయింది. ప్రమాదంలో కారు వెనుక భాగం దెబ్బతినగా, ఆటో ముందు భాగం నుజ్జయింది. ఆటోలో ఉన్న సీతారాములు, నాగలక్ష్మి, ఆదిలక్ష్మి, దేముడమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను అగనంపూడి ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. తీవ్రంగా గాయపడిన ఆదిలక్ష్మిని మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో సిగ్నల్ విద్యుత్ స్తంభం, హైమాక్స్ లైట్, రెయిలింగ్‌లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఉదయం సమయంలో రోడ్డుపై పెద్దగా జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ కృష్ణారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బొగ్గు లారీని క్రేన్ సహాయంతో బయటకు తీసి.. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు.

ముగిసిన బ్యాడ్మింటన్ టోర్నీ



సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సోమరాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలోని ఎస్–3 స్పోర్ట్స్ ఏరీనా వేదికగా జరుగుతున్న హండ్రెడ్ ఎస్3 ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 400 మంది క్రీడాకారులు అండర్ 11, 13, 15, 17 ఏళ్ల కేటగిరీల్లో హోరాహోరీగా తలపడ్డారు. ఇండియన్ ఆయిల్ సీనియర్ మేనేజర్ చైతన్య, శ్రీనివాస్, కార్పొరేటర్ ఉషశ్రీ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు వి.వి.సోమరాజును సత్కరించారు. స్పోర్ట్స్ ఏరీనా నిర్వాహకుడు సహాని తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఐటీఐ కౌన్సెలింగ్

తాటిచెట్లపాలెం: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 29 ప్రైవేట్ ఐటీఐల్లో 2025–26 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడ్‌ల్లో ప్రవేశాల కోసం ఈ నెల 5 నుంచి 10 వరకు కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ జె. శ్రీకాంత్ ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం 1,977 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, 1,663 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేసుకుని, కౌన్సెలింగ్‌కు అర్హత సాధించినట్లు చెప్పారు. ఇప్పటికే అభ్యర్థులందరికీ వారి మొబైల్ ఫోన్‌లకు సమాచారం పంపించామని, అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, వెరిఫికేషన్ ఫారంతో వారి జీపీఏ ప్రకారం కింద పేర్కొన్న తేదీల్లో హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు తప్పనిసరిగా మాస్క్, హ్యాండ్ శానిటైజర్‌ను ఉపయోగించి కోవిడ్ నిబంధనలను పాటించాలని స్పష్టం చేశారు.

కౌన్సెలింగ్ సాగుతుందిలా..

తేదీ	సమయం	ర్యాంకు నంబర్లు
05.06.2025	ఉదయం 8.00	1 నుంచి 230
	మధ్యాహ్నం 1.00	231 నుంచి 479
06.06.2025	ఉదయం 8.00	480 నుంచి 737
	మధ్యాహ్నం 1.00	738 నుంచి 1041
07.06.2025	ఉదయం 8.00	1042 నుంచి 1361
	మధ్యాహ్నం 1.00	1362 నుంచి 1663
09.06.2025	ఉదయం 8.00	బాలికలు, స్టీల్‌ప్లాంట్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 1 నుంచి 804
10.06.2025	ఉదయం 8.00	మిగులు ర్యాంకుల అభ్యర్థులు 805 నుంచి 1663



'పాలగెడ్డ'లో జారి యువకుడి మృతి

మృతుడు అక్కయ్యపాలెం వాసి



మృతి చెందిన రోషన్

మాడుగుల రూరల్: మాడుగులలో జరుగుతున్న మోదమాంబ జాతరకు విశాఖపట్నం నుంచి వచ్చిన యువకుడు పాలగెడ్డ జలాశయంలో కాలుజారి పడి మృతి చెందాడు. ఈ విషాద సంఘటన మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి. అక్కయ్యపాలెం గణేష్‌నగర్ కాలనీకి చెందిన కె.రోషన్, జయశంకర్, గణేశ్, ఎన్.నవీన్ కలిసి మంగళవారం ఉదయం మాడుగుల సమీపంలోని పాలగెడ్డ జలాశయంలో దిగారు. వీరిలో రోషన్ కాలుజారి జలాశయంలో పడిపోయాడు. రోషన్‌కు ఈత రాకపోవడంతో జలాశయంలో పడి మృతి చెందాడు. యువకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. రోషన్ మృతితో మిత్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. జాతర రోజున ఇటువంటి సంఘటన జరగడంపై స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

రౌడీషీటర్ చిట్టిమామ అరెస్ట్

ఎంవీపీకాలనీ: శాంతి ఆశ్రమం భూముల వ్యవహారంలో తన గ్యాంగ్ ద్వారా దౌర్జన్యాలకు పాల్పడిన కేసులో రౌడీషీటర్ చిట్టిమామను ఎంవీపీ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతరుల స్వాధీనంలో ఉన్న భూములను తిరిగి ఆశ్రమానికి అప్పగించాలని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ భూములను అనుభవిస్తున్న కొందరు ఆశ్రమ నిర్వాహకులను భయభ్రాంతులకు గురిచేశారు. ఇందులో భాగంగానే సుపారీ గ్యాంగ్ ద్వారా చిట్టిమామ దాడులకు, బెదిరింపులకు పాల్పడ్డాడని పోలీసులు గుర్తించారు. ఆశ్రమంలో జరిగిన గొడవలకు సంబంధించి నమోదు చేసిన కేసులో ఏ3గా ఉన్న చిట్టిమామను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

న్యాయ విద్యార్థుల అ'పూర్వ' కలయిక

మూడు దశాబ్దాల తరువాత చోడువాడలో కలుసుకున్న పాత మిత్రులు



అపూర్వ కలయిక పేరుతో కలుసుకున్న పూర్వ న్యాయ విద్యార్థులు

కె.కోటపాడు: విశాఖపట్నంలోని న్యాయ విద్యాపరిషత్ లా కళాశాలలో 1993లో చదువులు సాగించిన పూర్వ విద్యార్థులు అనకాపల్లి జిల్లా చోడువాడలో అపూర్వ కలయిక పేరుతో కలుసుకున్నారు. మూడు దశాబ్దాల తరువాత స్నేహితులంతా ఒక్కచోట చేరి గత స్మృతులను నెమరువేసుకున్నారు. అల్లరి చేష్టలను తలచుకొని రోజంతా సంతోషంగా గడిపారు. కుటుంబాల యోగక్షేమాలను ఒకరికి ఒకరు తెలుపుకున్నారు. ఈ అపూర్వ కలయికకు చోడవరం న్యాయవాది, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ సారథ్యం వహించారు. వివిధ ప్రాంతాల్లో న్యాయవాద వృత్తి నిర్వహిస్తున్న వారు, న్యాయశాఖలో వివిధ హోదాల్లో స్థిరపడిన వారు హాజరయ్యారు.

కమాండెంట్ మురళీకృష్ణకు ఘనంగా వీడ్కోలు



మురళీకృష్ణ దంపతులను సత్కరిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ అధికారులు, సిబ్బంది

పీఎంపాలెం: ఏపీఎస్పీ 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కేవీ మురళీకృష్ణ తిరుమల దేవస్థానం చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బక్కన్నపాలెం బెటాలియన్ ఆవరణలో ఆయన వీడ్కోలు సభ జరిగింది. స్థానిక అధికారులు, సిబ్బంది కమాండెంట్ మురళీకృష్ణ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం మురళీకృష్ణ మాట్లాడుతూ టీటీడీ సీవీఎస్‌వోగా బదిలీ కావడం, శ్రీవారి సన్నిధిలో సేవ చేసే అవకాశం లభించడం మహాభాగ్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి కమాండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాకుళం 1వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సంక్షేమం కోసం మురళీకృష్ణ నిరంతరం కృషి చేశారని కొనియాడారు. కేజీహెచ్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్పా మురళీకృష్ణ, ఇన్‌చార్జి అదనపు కమాండెంట్ పి.సత్యం, సహాయ కమాండెంట్లు ఎన్.మురళీధర్, వి.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.